

తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో వేడుకగా జరుగుతున్న జగనన్న స్వర్ణోత్సవ సంబరాల్లో కళాకారులతో స్టెప్పులేసిన మంత్రి రోజా

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

## పుష్ప ప్రదర్శనశాలను ప్రారంభించిన ఈఓ

## పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సిఎం



.ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

తిరుచానూరు, నవంబర్ 20 ప్రభాతవార్త:
తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం 9-45 గంటలకు మిథున లగ్నంలో అర్చకుల వేదమంత్రోచ్చారణ మధ్య ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి సుప్రభాతం నిర్వహించారు. గజ ప్రతిష్టలో భాగంగా యాగశాలలో పలు పూజా కార్యక్రమాల అనంతరం గజపటాన్ని ధ్వజారోహణ మంటపంలో కంకణభట్టార్ శ్రీ మణికంఠ బట్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ధ్వజారోహణ ఘట్టంలో మొదటగా విష్వకేనారాధన, పుణ్యాహవచ నం నిర్వనం నిర్వహించారు. ధ్వజస్థంభానికి అభిషేకం తరువాత బ్రహక్మ్రత్సవాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని దేవతలను ప్రార్థిస్తూ రక్షాబంధనం చేశారు.

## గోపాలకృష్ణుని అలంకారంలో ఊరేగిన అమ్మవారు



శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు ఆదివారం రాత్రి అమ్మవారు చ్నినశేష వాహనంపై గోపాలకృష్ణుని అలంకారంలో తిరుమాడ వీధుల్లో ఊరేగారు .వైకుంఠంలో లక్ష్మీ నారాయణులకు శేషుడు సేవలు అందిస్తున్నందున, చిన్నశేష వాహనంపై అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు యోగ సిద్ధి కలుగుతుందని నమ్మకం. పట్టు పీతాంబర, వజ్ర వైడూర్య, విశేష ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, రాత్రి 7 గంటలకు గజ, తురగ, వృషభాలు ముందు నడవగా, మంగళ వాయిద్యాలు, భజన బృందాలు, కోలాటాలు, జియ్యర్ స్వాముల ప్రబందనం, వేద పండితుల వేదపారాయణం, భక్తుల గోవిందనామ స్మరణలు, కర్పూర నీరాజనాలతో అమ్మవారు చిన్న శేషవాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు.

# కాపాడుతున్నారా.. మట్టిలో కప్పేస్తున్నారా..?

## విహంగాలకు కరవైన రక్షణ - - మృత్యువుతో పోరాడుతున్న విదేశీ విహంగాలు

## గుట్టుచప్పుడు కాకుండా మాయం చేస్తున్న అధికారులు



గూడబాతులు (ఫైల్‌ఫొటో),



చనిపోయిన గూడబాతులు

దొరవారిసత్రం, నవంబర్ 20 ప్రభాతవార్త
వన్యప్రాణుల ప్రాణాలు రోజురోజుకు గాలిలో కలిసిపోతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో విదేశీ విహంగాలు మృత్యువుతో పోరాడుతూ వారంరోజుల పరిధిలో రెండు మూడు విదేశీ స్వదేశీ విహంగాలో చనిపోతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యం వాటికి శాపంగా మారింది. వన్య ప్రాణులను కాపాడాల్సిన అధికారులు చనిపోయిన విహంగాలను ఎవరికీ తెలియకుండా మట్టిలో కప్పేస్తున్నారు. ఇలా చేస్తూ వన్య ప్రాణులను పక్షిప్రేమికులకు దూరం చేస్తున్నారు. దొరవారిసత్రం మం డలం నేలపట్టు పక్షుల వన్యసంరక్షణ కేంద్రంలో ఆదివారం నేలపట్టు రారాజుగా పేరొందిన గూడబాటు చనిపోయిన సంఘటన చోటు చేసుకుంది. అయితే ఈ గూడబాతును ఎవరికీ తెలియకుండానే అక్కడ పనిచేస్తున్న సిబ్బంది దూరంగా పారేశారు. విషయం తెలుసుకున్న 'ప్రభాతవార్త' వివరాలు సేకరించగా, గత వారంరోజుల నుంచి నేలపట్టు పక్షుల కేంద్రంలో రెండో గూడబాత చనిపోయినట్లు తెలిసింది. అయితే ఈ సమాచారం సంబంధిత అధికారులకు తెలియకపోవడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది.

### అధికారుల నిర్లక్ష్యమా.. పక్షులు చేసుకున్న పాపమా

నేలపట్టులో ఉన్న అధికారుల నిర్లక్ష్యం వన్యప్రాణుల ప్రాణం మీదకు వస్తోంది. వాస్తవానికి ఏదైనా వన్యప్రాణి చనిపోతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి ఆపై పశుసంవర్ధక అధికారులచే పంచనామా చేయించి చనిపోవడానికి గల కారణాలు వెల్లడించాల్సి ఉంది. కానీ నేలపట్టు పక్షుల కేంద్రంలో అధికారులు తమ రూటు సపరేటు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. చనిపోయిన విదేశీ విహంగాలను గుట్టుచప్పుడు కాకుండా అక్కడి నుంచి మాయం చేస్తున్నారు.

### స్థానికులకు ఒక న్యాయం.. అధికారులకు మరో న్యాయం

నేలపట్టు పక్షుల కేంద్రంలో చెరువు కట్టపై ఎలాంటి శబ్ధాలు గాని, వాహనాలు గాని వెళ్లకూడదు. కనీసం చెరువు కట్ట పనులు చేయా లన్నా కూడా పక్షుల లేని సమయంలో మాత్రమే చేయాలి. అయితే స్థానిక వైల్డ్ లైఫ్ అధికారులు ఇష్టారాజ్యంగా మోటార్‌బైక్‌లపై కట్టల మీద షికార్లు కొడుతూ విదేశీ విహంగాలను భయాందోళనకు గురిచేస్తు న్నారని పలువురు విమర్శలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పక్షి ప్రేమికులు ఈ వింత చేష్టలను చూస్తూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### ఇంత నిర్లక్ష్యమా

నేలపట్టు రేంజర్ ఆఫీసర్ ఇక్కడే ఉండి పక్షులను కాపాడాల్సి ఉండగా, ఎక్కడి నుంచో రాకపోకలు సాగిస్తూ ఏమి జరుగుతుందో సమాచారం తెలుసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి నేలపట్టు చిన్న పరిధి. ఇక్కడ ఉన్న మూగజీవాలను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. ఇక్కడ పనిచేస్తున్న అధికారులు మాత్రం అలాంటి చర్యలు చేపట్టకపోవడం ఎన్నో అనుమానాలకు దారితీస్తోంది. దీనికితోడు నేలపట్టు పక్షుల కేంద్రానికి రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు వేటకు వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకో వాలని పలువురు కోరుతున్నారు. దీనిపై సూళ్లూరుపేట డిఎఫ్‌ఓను 'ప్రభాతవార్త' వివరణ కోరగా వన్యప్రాణులు చనిపోయిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారణ జరిపి ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని డిఎఫ్ఓ శామ్యూల్ తెలిపారు.

# కొత్త జిల్లాల్లో అన్ని వసతులు కల్పనకు కృషి

## - ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



నాయుడుపేట, నవంబర్ 20 ప్రభాతవార్త
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త జిల్లాలలో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. ఈ నేపథ్యంలోనే నాయుడుపేటలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుతో పాటు రోడ్లు, ఇతర వసతులు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాయుడుపేటలో ఆదివారం డీఎస్పీ కార్యాలయం ప్రారంభంతో పాటు, గోమతి సర్కిల్ నుంచి స్వర్ణముఖి నది వరకు నిర్మించ తలపెట్టిన నాలుగులైన్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త జిల్లాలను ప్రకటించిన తర్వాత ఆయా ప్రాంతాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగానే నాయుడుపేటలో పోలీసు సబ్‌డివిజన్ ఏర్పాటు అన్నారు. త్వరలోనే ఈ ప్రాంతంలో డీసీసీబీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని, నిజాయితీ నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. అలాంటి వారికి కోపం సర్వసాధారణమైన విషయమని, అలాంటి చిన్నచిన్న విషయాలు పెద్దవిగా ఆలోచించకుండా అందరూ కలిసికట్టుగా సంజీవయ్యకు అండగా ఉండాలన్నారు. కష్టపడి పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ సబ్ డివిజన్ నాయుడుపేటకు తీసుకురావడంలో ఎమ్మెల్యే సంజీవయ్య కృషి ప్రశంసనీయమన్నారు. ఆయన కష్టపడే వ్యక్తి అని, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తి అని, నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీలు బల్లి కల్యాణ చక్రవర్తి, వాకాటి నారాయణరెడ్డి, ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, డిప్యూటీ ఛైర్మన్ రఫీ, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# నిమ్మకాయ ధర లేక దిగాలు పడ్డ రైతన్న



వెంకటగిరి నవంబరు 20 ప్రభాతవార్త
వేసవి కాలం వచ్చినా నిమ్మకాయలకు గిట్టుబాటు ధరలు లేక పోవడం వల్ల రైతులు దిగాలు పడుతున్నారు. బస్తా(లూజు)కాయులు 600 రూపాయలు మాత్రమే పలుకుతున్నాయి. నిమ్మకాయల ధరలు గతంలో ఆశాజనకంగా ఉన్నా యి. గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు కాయలను తోటల్లోనే వదిలి వేస్తు న్నారు. కూలీలను పెట్టి కోసి మార్కెట్‌కు తలిస్తే ఖర్చులకు కూడ రావడం లేదన్నారు. ఢిల్లి, బెంగుళూరు పట్టణాల్లో మంచు ఎక్కువగా ఉండడంతో దరలు పలకడం లేదన్నారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలల్లోని నిమ్మకాయలను రైతులు గూడూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుండి ఇతర ప్రాంతాలకు తరలిస్తారు.

# మాస్‌ను గెలిచే ధీటైన లీడరెవరు!?

## తిరుపతిలో టిడిపి అధిష్టానం ఆరా!!



ప్రభాతవార్త-తిరుపతి:
ఎన్నికలకు మరో పదహారునెలలు సమయం ఉండగానే తిరుపతిలో అంతర్గతంగా ఎన్నికల వేడి మొదలైందనే చర్చ జరుగుతోంది. నగరంలోని బస్టాపులు, టీ కొట్టుల వద్ద చివరకు మద్యం బార్లలో కూడా ఎన్నికల టాఫిక్ హాట్‌గా మారింది. తిరుపతిలో అధికార వైసిపి ని ధీటుగా ఎదుర్కొగల నాయకుడు టిడిపిలో లేరనే చర్చ కూడా మొదలైంది. ఇక్కడ ఇప్పటి పరిస్థితుల్లో పార్టీ శ్రేణులను కలుపుకుని వెళ్ళే సరైన మాస్‌లీడర్ ఎవరనేది టిడిపి అధిష్టానం కూడా ఆరా తీస్తోంది. తిరుపతిలో సరైన లీడర్ ఎవరనేది తల నొప్పి వ్యవహారంగా మారింది. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లా కూడా కావడంతో తిరుపతిపై కొంత పట్టుఉండాలనేది ఆలోచన. ఇందుకు తగ్గట్లు ప్రస్తుతం పార్టీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పార్లమెంటరీ కమిటీ అధ్యక్షుడు నరసింహయాదవ్, జాతీయ, రాష్ట్ర పార్టీ కమిటీల్లో నాయకులు సూరా సుధాకర్‌రెడ్డి, ఇనుకొండ సుబ్రమణ్యం, మబ్బు దేవనారాయణరెడ్డి, పుష్పావతియాదవ్, బుల్లెట్‌రమణ, రాయలసీమ ప్రాంత మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ నాయకులతోబాటు వైసిపిని ధీటుగా ఎదుర్కొనే సత్తా నాయకులు లేరు. గతంలో జరిగిన తిరుపతి నగరపాలకసంస్థ కార్పొరేటర్ ఎన్నికల్లోనూ, తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు ఎన్నికల్లో నేతల పనితీరు తేటతెల్లమైంది. గతంలో ఐదేళ్ళు పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పచ్చచొక్కాలు వేసుకుని హడావిడి చేసిన నేతలు, పదవులు అనుభవించి అంతో ఇంతో పనులు చేసుకున్న వాళ్ళు ఇక పత్తాలేరు. తిరుపతిలో మాస్‌లీడర్ కోసం చేపట్టిన అన్వేషణలో అర్థబలం, అంగబలం ఉన్న వారికోసం వెతుకులాట మొదలుపెట్టింది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా దీటుగా ఇతర పార్టీలనే ఎదుర్కొనే పరిస్థితిలో పార్టీలో ఉన్న నాయకులు కనిపించడంలేదు. రానున్న ఎన్నికల్లో అధికార వైసిపిని ఎదుర్కొని కేడర్‌ను నడిపించే నాయకులు కూడా లేరనేది పార్టీ విశ్లేషకుల అంచనా. రానున్న ఎన్నికల్లో కూడా ప్రస్తుత ఇన్‌ఛార్జి సుగుణమ్మకే టిక్కెట్ ఇస్తారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నా అదే వర్గానికి చెందిన కొందరు నేతలు తమకంటే తమకని పేర్కొంటున్నారు. అయితే తిరుపతిలో పార్టీ రాజకీయ పరిస్థితులపై చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది పార్టీకోసం పనిచేస్తున్న నాయకులు కూడా చెప్పుకోలేకపోతున్నారు. ఎన్నికలకు సమయం ఉండగానే రాజకీయంగా పలు పార్టీల పొత్తుపై కూడా తిరుపతి నేతల్లో సూచాయంగా చర్చ మొదలైంది. జనసేన, టిడిపి కలసి పనిచేసినా సత్తాఉన్న నాయకుడు లేకపోతున్నాడనేది మరోవర్గం బలమైన వాదన. ఇదిలా ఉండగా గతంలో పార్టీలో కీలక పదవులు అనుభవించి, ప్రజలకు దగ్గరైన నాయకులు మళ్ళీ ఎన్నికల సమయానికి పార్టీకి దగ్గరై టిక్కెట్ తెచ్చుకుని గెలవడమే ముఖ్యమని జోరుగా ప్రచారం సాగుతోంది .ఇదే సమయంలో అధికార పార్టీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, యువనేత, నగరపాలక ఉపమేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ఆపార్టీ నేతలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రజలకు దగ్గరగా ఉంటూ గడపగడపకు కార్యక్రమంతో బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకుంటున్నారు. ఆ దిశగా సీరియస్‌గా పనిచేసుకుని వెళుతున్నారు.

## ఉష్ణోగ్రతలు

20/11/2022



- తిరుపతి 29 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 23 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30డిగ్రీలు

## బంగారం ధరలు

19/11/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,925

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,373

## కోడిగ్రుడ్ల ధరలు

20/11/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

# శివరాత్రిని మరపిస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయం



శ్రీకాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తిక మాసం ఆదివారం భక్త జనంతో నిండింది. శివనామస్మరణతో దద్దరిల్లింది. ఆలయం శివరాత్రిని మరపించింది. దీపాల వెలిగింపుతో పునీతమైంది. సాధారణంగా కార్తిక మాసంలో శివాలయంలో దీపాలు వెలిగిస్తే మంచిదనే నమ్మకం ఉంది. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తు తాకిడి అధికంగా చోటు చేసుకుంది. సాధారణంగానే శ్రీకాళహస్తీశ్వరాయలంలో ఆదివారం గుక్కతిప్పుకునే వీలు లేని విధంగా రాహుకాలంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటారు. కార్తిక మాసంలో ఇక చెప్పక్కర్లేదన్నట్లు మారింది. ఎంతో నమ్మకంతో శ్రీకాళహస్తీశ్వరుని అభిషేకాలు జరిపించుకొనుటకు వస్తుంటారు. కోరిన భక్తులందరికి అభిషేకాల సేవలందించటానికి అధికారులు చొరవ చూపారు. ఆలయ సిబ్బంది అంతా బాధ్యతగా వ్యవహరించారు.

### హర హర మహాదేవ శంభోశంకరా!

ఆదివారం శ్రీకాళహస్తి పట్టణం,, సువర్ణముఖి నది పరిసరాలు ఓంకారనాదం, హర హర మహాదేవ శంభోశంకరా అంటూ దద్దరిల్లాయి. వేకువ జాము నుంచి తరలి వచ్చిన భక్త జనం జీవనది సువర్ణముఖిలో స్నానమాచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తు రద్దీని గమనించిన ఇఓ వికె సాగర్‌బాబు సిబ్బందికి బాధ్యతల్ని అప్పగించారు. ఐదుగంటల నుంచి స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు ప్రారంభించారు. ఆయన ప్రతి గంటకు ఆలయంలోని తిష్టవేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పర్యవేక్షించారు. అంచనాలకు మించి భక్తులు రావటంతో భారీ ఎత్తున ప్రసాదాల అమ్మకాలు జరిగాయి.

### దివ్వెల జిలుగుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం:

కార్తీమ మాసం శివాలయంలో దీపం వెలిగిస్తే మంచి జరుగుతుందనే నమ్మకం ఉంది. ఈ నేపధ్యంలో స్థానిక, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం బిక్షాల గాలిగోపురం నుంచి రంగుల గోపురం వరకు చక్కగా దీపాలు వెలిగించుకునేందుకు అవకాశం కల్పించారు. దాంతో భక్తులు ఎంతో సంబర ప డ్డారు. ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఎంతో సంయమనంతో భక్తుల సదుపాయాల్ని పర్యవేక్షించారు. ఇక వచ్చిన భక్తుల వాహనాలు ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేశారు. కాంట్రాక్టర్లు సొమ్ములు వసూలు చేసుకుంటున్నారు కానీ వవాహనాలకు కనీసం నీడ కల్పించటం లేదు. వీధులే వారికి పార్కింగ్ మారుతుంది. ఈ సమస్య అధికారులకు తెలియనిది కాదు. తమ ఖజానాకు లక్షలు వస్తున్నాయి చాలదన్నట్లు మారుతున్నారు.

### 30వేలు దాటిన భక్త జనం:

దర్శన టిక్కెట్లు వివరాలు ఇలా ఉన్నాయి. రూ.200లుచెల్లించి ప్రవేశించిన వారు 3596మంది కాగా రూ.50ల టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 3450 మంది ఇక రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్న వారి వివరాలను దేవస్థానం విడుదల చేసింది.

## గుట్టకిందపల్లెకు చేరుకున్న

# మెల్‌బోర్న్ రోడ్డు ప్రమాదం యువకుడి మృతదేహం

## -అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు





మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయిరోహిత్ (ఫైల్‌పోటో), మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

ఐరాల, నవంబర్ 20 ప్రభాతవార్త:
ఆ స్ట్రేలియా లో ని మెల్‌బోర్న్‌లో ఈనెల 3న ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐరాల మండలం పొలకల గ్రామ పంచాయతీ గుట్టకిందపల్లె యల్లంపల్లెకు చెందిన సాయి రోహిత్ (28) మృతదేహం ఎట్టకేలకు 17 రోజుల అనంతరం ఆదివారం స ్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని గుట్టకింద యల్లంపల్లెకు చెందిన కుసుమకుమారి, మోహన్‌నాయుడు కుమారుడు సాయి రోహిత్(28) అనే యువకుడు 2016లో ఎంఎస్ చదువుకునేందుకు ఆస్ట్రేలియాలోని మోల్‌బోర్న్‌కు వెళ్ళాడు. అక్కడ చదువుకుంటుండగా 2017 తండ్రి మృతి చెందడంతో స్వగ్రామానికి వచ్చి వెళ్ళాడు. అప్పటి నుండి మెల్‌బోర్న్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ అక్కడే వుంటున్నాడు. ఈనేపథ్యంలో విధుల కోసం కారులో వెళుతూ మెల్‌బోర్న్ సమీపంలోని గుల్‌బర్‌వ్యాలీ హైవేలో సియోమోర్ వద్ద పొగమంచు కారణంగా రోడ్డు సక్రమంగా కనపడక రోడ్డు పక్కనున్న చెట్టును డీకొన్నాడు. దీనితో తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనితో సాయిరోహిత్ మృతదేహాన్ని ఇండియాకు తరలించడానికి మెల్‌బోర్న్‌లోని తెలుగు సంఘం వారు ప్రయత్నాలు సాగించి కార్గో విమానంలో సాయిరోహిత్ మృత దేహాన్ని ఇండియాకు తరలించారు. దీనితో ఆదివారం మృతదేహం స్వగ్రామం గుట్టకిందపల్లెకు చేరకుంది. దీనితో సాయిరోహిత్ మృతదేహానికి కుటుంబసభ్యులు, బంధువులు అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

# కాలుష్యం బారిన ఆధ్యాత్మిక నగరం!

**-రోజురోజుకూ ప్రమాదం ఎక్కువంటున్న శాస్త్రవేత్తలు**

ప్రభాతవార్త-తిరుపతి:
యాత్రాస్థలం...ఆధ్యాత్మిక నగరం తిరుపతిస్మార్ట్‌సిటీలో రోజురోజుకూ కాలుష్యశాతం పెరిగిపోతోందనే ఆందోళన పర్యావరణ శాస్త్రవేత్తలు, కేంద్రకాలుష్యనియంత్రణమండలి (సిపిసిబి) వ్యక్తంచేస్తోంది. ఇంటినుంచి సరదాగా నగర రోడ్లపై నడక సాగిద్దామనుకున్నా... ఉదయం సాయంత్రం వేళల్లో నడక అలవాటుచేసుకున్న ప్రజలు, సీనియర్ సిటిజన్లు ఇళ్ళను వదలి బయటకు రావాలంటే రోడ్లపై ధుమ్ముతో బాటు వాహనాల కాలుష్యంతో మరీ ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల ఇదే విషయంపై కాలుష్యనియంత్రణమండలి కూడా కొంత ఆందోళన చెందింది. గాలి కాలుష్యం గత 24గంటల్లో (ఎక్యూఐ)231గా నమోదవడం జరిగింది. ప్రతిరోజూ ఈ కాలుష్యం శాతం 2.5 శాతం ఎక్కువవుతోందని శాస్త్రవేత్తలు అధ్యయనం. గాలిలో కాలుష్యశాతం 336 నుంచి 90 మధ్యలో ఉంటుంది. అయితే గత వారంరోజుల్లో ఈ కాలుష్యం 263శాతంగా నమోదవడం



మరింత ఆందోళనకు దారితీస్తోంది. అయితే ఈ కాలుష్యం దీపావళి పర్వదినాల్లో తప్ప ఇదివరకు నమోదు కాలేదనేది సమాచారం. నగరంలో ప్రధానంగా అలిపిరి, కెటిరోడ్డు, ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్, ప్రకాశంరోడ్డు, ఎంఆర్‌పల్లి, రేణిగుంటరోడ్డు, ఆర్‌సి రోడ్డు ప్రాంతాల్లో కాలుష్యశాతం మరీ ఎక్కువగానే ఉందనేది పర్యావరణ శాస్త్రవేత్తల అధ్యయనం. అయితే దీనిపై పర్యావరణ శాస్త్రవేత్తలు, ఎస్వీవిశ్వవిద్యాలయం అధ్యాపకులు, ప్రముఖ శ్వాసకోశ,ఊపిరితిత్తుల వైద్యనిపుణులు కూడా కాలుష్యం పెరిగిపోవడానికి వాహనాలు నుంచి వెలువడే పొగ, రోడ్లపై, పరిసరాల్లో ధుమ్ము,ధూళి, పేరుకుపోయిన నిరుపయోగ గృహ నిర్మాణ పదార్థాలు వంటి వాటివి కారణాలుగా చెబుతున్నారు. కాలుష్యంశాతం ఆందోళన కలిగిస్తున్న సమయంలో సీనియర్‌సిటిజన్లు, వృద్ధులు, శ్వాసకోశతో ఇబ్బంది పడే ప్రజలు. చిన్నపిల్లలు వీలైనంత వరకు రోడ్లపైకి బయటకు రావద్దని సూచిస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని ఇతర నగరాల్లో కూడా గత వారంరోజుల్లో తక్కువశాతం కాలుష్యంశాతం నమోదైందనేది శాస్త్రవేత్తల సమాచారం. వాతావరణంలో మార్పులు, గాలికాలుష్యం ప్రధానంగా కాలుష్యశాతం పెరగడానికి కారణాలుగా చెబుతున్నారు. పెరుగుతున్న జనాభా, యాత్రికుల సంఖ్యతోబాటు విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలని సూచిస్తున్నారు.

## నగరిలోనే కాదు...రాష్ట్రంలో కూడా టిడిపిదే గెలుపు

గాలి భానుప్రకాష్

నగరి, నవంబరు 20 ప్రభాతవార్త :
వచ్చే ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలోనే కాదు...రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీయే గెలుస్తుందని ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం నగరి పట్టణంలోని కస్తూరి కల్యాణమండపంలో రియల్ టైమ్ స్ట్రాటజీ పై వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి నగరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసి పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు బహుమతిగా ఇవ్వాలని తెలిపారు. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆర్‌టిఎస్ విధి, విధానాలను అందరూ పాటించి పార్టీ గెలుపు కోసం పోరాడాలని, అందరికీ అండగా వుంటానని భరోసా ఇచ్చారు. ఆర్‌టిఎస్ ట్రైనర్లు అనిమిని దినేష్, జి.గోపినాథ్‌లు టెక్నాలజీని ఉపయోగించి ఏ విధంగా అధికార పార్టీని ఎలా తిప్పికొట్టాలో వివరించారు. సోషల్ మీడియాను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ చెన్నూరు సుధాకర్‌బాబు, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు, బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, టిఎన్‌టియుసి అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, పుత్తూరు, నగరి పట్టణ పార్టీ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, రమేష్‌బాబు, పుత్తూరు రూరల్ అధ్యక్షుడు డి.రవికుమార్, అధికార ప్రతినిధి జ్యోతినాయుడు తదితరులు పాల్గొన్నారు

## భక్తి శ్రద్ధలతో ఆంజనేయస్వామికి ఆకుపూజ

సదుం, నవంబరు 20ప్రభాతవార్త



సదుంలోని గార్గేయనది ఒడ్డున ఉన్న శ్రీఆంజనేయస్వామి వారికి ఆదివారం భక్తిశ్రద్దలతో ఆకుపూజ నిర్వహించారు. కార్తీక మాసం చివరి ఏకాదశి రోజు కావడంతో ఉదయం స్వామి వారికి 108 బిందెల నీటితో అభిషేకంచేశారు. అనంతరం వివిధ రకాల సుగంద ద్రవ్యాలతోను, పంచామృతంతోను అభిషేం జరిపారు. అనంతరంతమలపాకులతో ఆకుపూజ చేశారు. ఈసందర్భంగా ఆంజనేయస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు.అన్నదానం ఏర్పాటు చేశారు. సదుం బలిజవీధికి చెందిన వెంకటరమణ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా మండల పరిదిలోని ఊటుపల్లెపంచాయతీ దేవళంబోడు శ్రీమల్లికార్జున స్వామి వారి సన్నిదిలో రాత్రి అయ్యప్పస్వాముల పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు, స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బొమ్మిరెడ్డిగారిపల్లె, పుట్టావారిపల్లె తదితర గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి వెళ్ళి పనిచేయండి

-ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటం చేయండి , :ఉమ్మడి జిల్లా నేతలకు 'బాబు"నిర్దేశం

తిరుపతి,నవంబర్ 20ప్రభాతవార్త:





రాష్ట్రంలో మూడున్నరేళ్ళ వైకాపా పాలనపై, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి పోరాటం చేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేశారు. ఆషామాషీగా గాకుండా ప్రజల్లోని ఉండి, వారితో కలసి పనిచేయాలని, పార్టీని బలోపేతం చేసుకుని బడుగుబలహీనవర్గాల వారికి టిడిపి అండగా వుంటుందని చెప్పాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఆదేశించారు. రాష్ట్రపార్టీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సర్వసభ్యసమావేశంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాకు చెందిన నాయకులు నరసింహయాదవ్, ఎం.సుగుణమ్మ, సూరాసుధాకర్‌రెడ్డి, ఇనుకొండ సుబ్రమణ్యం, మబ్బుదేవరనారాయణరెడ్డి, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డాక్టర్ సప్తగిరిప్రసాద్, గౌనివారి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, చిన్నబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగాఉండాలని బాబు నిర్దేశం చేశారు.

## సబ్సీడిపై రైతులకు వేరుశెనగ విత్తనాల పంపిణీ

నారాయణవనం, నవంబర్ 20 ప్రభాతవార్త :
మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశెనగ విత్తనాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సకాలంలో వేరుశెనగ విత్తనాలను అందించడం వల్ల పంట పండించుకోవడానికి ఉపయోగకరంగా వుంటుందన్నారు. దీన్ని దృష్టిలో వుంచుకొని రైతులకు 30 కిలోల వేరుశెనగ బస్తాను వాస్తవానికి 2575 రూపాయాలకు అందించడం జరుగుతుందని, అయితే సబ్సీడి క్రింద 1545 రూపాయాలకు అందించడం జరుగుతుందన్నారు. రైతులకు సబ్సీడిగా 1030 రూపాయాలు తగ్గుతుందన్నారు. అయితే రైతులు విత్తనంతో పాటు శుద్ది మందు కలిపి మొత్తం 1600 రూపాయాలను కట్టాలన్నారు. కావాల్సిన రైతులు రైతుభరోసాకేంద్రాలకు వెళ్లి పొందవచ్చన్నారు. రైతులు తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డును తప్పక తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఎడిఎ రుద్రరాజు రమేష్‌రాజు, ఎంపిడిఓ గుణశేఖర్, ఎఒ శోభారాణి, మండల వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ నారాయణస్వామి, డిసిసిబి డైరెక్టర్ టి ఊరప్ప, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, డైరెక్టర్లు హేమయంద్రారెడ్డి, మనోహర్‌మొదలియార్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిటిడి సారధ్యంలో కంకణ ధారణలు

శ్రీకాళహస్తి,నవంబర్ 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని కొండమిట్ట వినాయక గుడి వద్ద ఆదివారం టిటిడి సారధ్యంలో మహిళలకు కుంకుమ,కంకణదారణలు అందజేసారు. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ డైరెక్టర్ రాజకుమార్ సారధ్యంలోఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఈసందర్భంగారాజ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యాక్షేత్రంలో నిత్యం ధార్మిక కార్యక్రమాలు నిర్వహించబడుతుందన్నారు. తిరుచానూరు పద్మావతి దేవి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమాల్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జన్మించటం పూర్వ జన్మ సుకృతమే అన్నారు.న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటిరమేష్‌బాబు మహిళలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో కొనసాగుతున్న అయ్యప్ప భక్తుల రద్దీ

-పార్కింగ్ స్థలాల్లో వాహనాల కిటకిట -దర్శనానికి నాలుగు గంటల సమయం

కాణిపాకం, నవంబర్ 20 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం ఆదివారం కూడా అయ్యప్ప భక్తుల రద్దీ కొనసాగుతోంది. కాణిపాకంలో నూతన ఆలయం ప్రారంభమైనప్పటి నుండి భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. ఈనేపథ్యంలో గత నాలుగైదు రోజుల క్రితం శబరిమల అయ్యప్ప ఆలయంలో స్వామివారి దర్శనాలు ప్రారంభం కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివెళుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులు పెద్దఎత్తున తరలివెళుతున్నారు. శబరిమల దర్శనంకు వెళ్ళే అయ్యప్పభక్తులు ముందుగా విఘ్ననాయకుడైన కాణిపాకం వినాయకునికి దరి ్శంచుకోవడం ఆనవాయితీ. ఈమేరకు శనివారం అయ్యప్ప భక్తులు వివిధ ప్రాంతాల నుండి స్వామిదర్శనం కోసం భారీగా తరలివచ్చారు. అలాగే ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్ధీ నెలకొంది. ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని అయ్యప్ప భక్తులతో పోటెత్తింది. అయ్యప్ప భక్తులు వేకువజామున నుండి స్వామి దర్శనంకోసం క్యూలైన్లలో బారులు తీరి నిలబడ్డారు. అయినప్పటికి భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్ధితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే అయ్యప్పభక్తులు వచ్చిన వివిధ రకాల వాహనాలతో కాణిపాకం పరిసరాలు, వాహన పార్కింగ్‌లు పూర్తిగా నిండిపోయాయి. సుమారు 20 వేల మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. రద్ధీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## శాంతిభద్రతల దృష్ట్యా 30యాక్ట్‌చట్టం అమలు

శ్రీకాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త



పట్టణ పరిధిలోని శాంతి భద్రతల దృష్ట్యా 30పోలీస్ యాక్ట్ అమలు, అతిక్రమించిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి ధర్మవరపు విశ్వనాథ్ తెలిపారు. ఈమేరకు డిఎస్పీ ఆదేశాల ప్రకారం టుటౌన్ సిఐ భాస్కర్ నాయక్, పోలీసులు జనసేన నాయకులుకు నోటీసులు జారిచేశారు. ఈసందర్భంగా టుటౌన్ సిఐ మాట్లాడుతూ గత కొన్నాళ్ళు నుంచి పత్రికలద్వారా, సోషల్ మీడియా ద్వారా బహిరంగంగా వైఎస్ఆర్‌సిపి పార్టీ మరియు జనసేన పార్టీ నాయకులు ఒకరిపై ఒకరిపైన ఒకరు వేర్వేరు విషయాలపై ఒకరిపైన ఒకరు మరొకరు పోటాపోటీగా పట్టణంలోని పెండ్లిమండపం వద్ద బహిరంగ చర్చకు పిలుపు ఇవ్వడంతో రెండు పార్టీల నాయకులు మరియు వారి అనుచరులు అక్కడికి చేరితే శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశం ఉన్నందున, ఇరు పార్టీల కార్యక్రమానికి అనుమతి నిరాకరించామన్నారు.ఇప్పటికేఇరుపార్టీలవారినోటీసులుఇచ్చామనిఎవరైనానిబంధనలు అతిక్రమించి నట్లయితే వారిపైన 30 పోలీస్‌యాక్ట్ మేరకు చట్టపరమైన చర్యలుతీసుకోవడం జరుగుతుంద న్నారు. పవిత్రపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో శాంతిభద్రతల పరిరక్షణకోసం ప్రజలందరు సహకరించాలని కోరారు.

## చట్టాలు వర్తించేది ఒక్క జనసేన పార్టీకి మాత్రమేనా?

శ్రీకాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త



పోలీస్‌చట్టం 30 అమలు జనసేన పార్టీకి మాత్రమేనా అని ఇంటి నిర్మాణాల్లో అవకతవకలు ఉంటే నిరూపించాలని పవన్‌కళ్యాణ్‌కు ఓపెన్ ఛాలెంజ్‌ను విసిరిన ఎంఎల్‌ఏ ఛాలెంజ్‌ను స్వీకరించిన జగనన్న ఇండ్లలోని మోసాన్ని నిరూపిస్తామని ఆదివారం చర్చకు సిద్ధం అన్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత.కోటను పోలీసులను అడ్డుపెట్టుకుని వినుతకోట, నాయకులను, జనసైనికులను ఛాలెంజ్‌కి రాకుండా ఆపాలని ప్రయత్నించడం ఎంఎల్‌ఏ అసమర్థతకు నిదర్శనం అని ఛాలెంట్ ఎదుర్కొవడానికి దమ్ము, ధైర్యం లేనపుడు చాలెంజ్ విసరం ఎందుకని ఆమె అభిప్రాయపడ్డారు. పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో సెక్షన్ 30యాక్ట్ నవంబర్ 14 నుంచి ఉందని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మూడు రోజుల క్రితం ఎంఎల్‌ఏ ఆధ్వర్యంలో పట్టణంలో మూడు రాజధానులు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించినపుడు 30యాక్ట్ అమలు ఎందుకు వర్తించలేదని ఆమె ప్రశ్నించారు. జనసేన అంటే భయం లేదు అంటూనే పట్టణం మొత్తం పోలీసులతో నింపేసి, తన ఇంటి ద్ద 70మంది పోలీసులను పెట్టడంలోనే అధికార పార్టీనాయకులకు భయం తెలుస్తోందన్నారు. నాలుగుమండలాల జనసేన నాయకులను గృహనిర్బందం చేసి శ్రీకాళహస్తి పట్టణంకి వస్తున్న జనసైనికులను ఎక్కడికక్కడ వెనక్కి పంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. పోలీసులు 30యాక్ట్‌ను దుర్వినియోగం చేయడాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. విధాన పరమైన అంశాలపై మాట్లాడితే చూస్తూఊరుకోమని తమ అధినేత పవన్‌కళ్యాణ్ గురించి వ్యక్తిగతంగా మాట్లాడితే దానికి దీటుగా సమాధానం చెప్తామన్నారు. జనసేన పార్టీ మాట్లాడే ప్రతి మాటకి ఆధారాలు ఉంటేనే ఆరోపణలు చేస్తామే తప్ప ఉత్తుత్తి ఆరోపణలు , సవాళ్ళు చేయమని ఆమె తెలిపారు. అధికారపార్టీకి చివరిరోజులు దగ్గరపడ్డాయని 2024 ఎన్నికల్లో తప్పక ప్రజలే బుద్దిచెప్తారని వివరించారు.

## సాయినామ త్రైయాహం

శ్రీకాళహస్తి,నవంబర్ 20 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆదివారం నుంచి సాయినాధుని ఆఖండ సాయి నామ త్రైయాహంను భక్తి శ్రద్దలతో ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్ని కర్నాటకలోని క్షేత్రగాణగాపూర్‌లోని దత్త గురు భండార ట్రస్టుచే ఈ కార్యక్రమాల్ని ఏర్పాటు చేసారు. 'ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి అనే సాయి తారక నామంతో మార్మోగింది,ఉదయం 6.30గంటలకు ప్రారంభించిన సాయినామ స్మరణ 23 ఉదయం 6.30గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమాలు పట్టణంలోని బేరివారి సత్రంలో ఏర్పాటు చేసారు. స్థానిక భక్తులు కూడా పాల్గొనవచ్చునని పిలుపు నిచ్చారు

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం

.తొట్టంబేడు, నవంబర్ 20 ప్రభాతవార్త



త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలని పలువురు తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్నకన్నలి, పెద్దకన్నలి, తాటిపర్తి, చిన్నసింగమాల, పెద్దసింగమాల, కల్లి పూడి గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక శ్రీకాళహస్తి కమిటీ సారధ్యంలో ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ త్రిమ ఏకైక గురువు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంధాలను ప్రచారం చేస్తున్నామన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరాలు తెలుసుకునేందుకు మద్యాత్మ ఆరాధనతో ధర్మాల స్థాపన జరుగుతుందన్నారు. అదే త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగాధ్యాయంలో 16,17 శ్లోకాలు త్రైత సిద్ధాంతానికి ఆధారం అని, త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి ప్రజల మద్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజలలో దైవభక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షులు చింతా సుబ్రమణ్యం, సురేష్‌యాదవ్, సుధ, వెంకటలక్ష్మి, అమరా వతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సేద్యంపై మాజీ ఉపరాష్ట్రపతి ప్రశంసలు

-ఉత్తమరైతుగా అవార్డు ప్రదానం

తొట్టంబేడు, నవంబర్ 20 ప్రభాతవార్త



పురుగుమందులతో సాగిస్తున్న వ్యవసాయం, దానితో పండించిన పంటలు అన్నదాతలు ఎంతో శ్రమ కోర్చి చేసిన పంటలే. వరి, వేరుశనగ పంటలు సాగు చేయాలంటే అన్నదాతలువ్యవసాయాన్ని చేయాల్సిందే. నేడు దేశంలోని ప్రతి ఒక్కరు కడుపునిండా అన్నం తింటున్నారంటే అది అన్నదాతల సేవే. అయితే వీటన్నిటించిన విశ్మరించి నేడు అన్నదాతల్లో ప్రకృతి వ్యవసాయం కాకుండా రసాయన ఎరువులతో వాడే పంటలును సాగుచేయడం గమనించదగ్గ విషయం. అయితే ఈ వ్యవసాయం వల్ల లాభాలకంటే నష్టాలే అధికంగా ఉంటున్నాయి. ఈనేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న అన్నదాత జలగం.శ్యాం హైదరాబాద్‌లో ఆదివారంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతులమీదుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందుకు సత్కరించినట్లు తెలిపారు. ఈసందర్భంగా శ్యాంకు పలువురు గ్రామరైతులు, గ్రామస్తులు, నాయకులు అభినందనలు తెలిపారు. అనంతరం శ్యాం మాట్లాడుతూ 25ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని ప్రస్తుతం వ్యవసాయం మొత్తం ఎరువులు రసాయనాలతో పండిస్తున్నారని తెలిపారు. ప్రతి ప్రకృతి వ్యవసాయం ఆరోగ్య కరమైందని తెలిపారు. ప్రతిరైతు దీనిపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు సేవాభావాన్ని అలవరచుకోవాలి

శ్రీకాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త



.ప్రతి ఒక్కరు సేవా భావాన్ని అలవరచుకోవాలని హైదరాబాదుకు చెందిన ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆర్ముగం, ఫిజియోథెరఫి స్పెషలిస్ట్ డాక్టర్‌శీనప్పలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమంలో భాగంగా 131వ సేవా కార్యక్రమాన్ని నగరివీధిలోని కార్యాలయంలో నిర్వహిం చారు. ఈసందర్భంగా ముఖ్యఅతిధులు మాట్లా డుతూ ప్రతినెలా సంస్థ ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత భాగం ప్రత్యేక ప్రతిభావంతులకు నెలసరి సరుకులు అందించడం ఇలాంటి కార్యక్రమాల్లోనే పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మాన వసేవయే మాధవసేవ అన్న నినాదంతో ప్రతి ఒక్కరుముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడుమునీర్‌బాషా,సభ్యులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, హరి, డిల్లీబాబు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కల్యాణవేంకన్న సన్నిధిలో ఏకాదశి ఉత్సవ సందడి

నారాయణవనం, నవంబర్ 20 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో ఆదివారం ఏకాదశి ఉత్సవంతో భక్తుల సందడితో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యావచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## యువత ఓటు నమోదు చేసుకోవాలి

పుత్తూరు, నవంబరు 20 ప్రభాతవార్త :



దేశ భవిష్యత్‌కు కీలకమైన యువత తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని టిఎన్‌టియుసి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు తెలిపారు. మునిసిపాలిటీలోని22వవార్డులోఓటర్లనమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకుని ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సూచించారు. 76వ బూత్ బిఎల్ఓ హేమంత్‌ను కొత్త ఓటర్ల నమోదుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో 22వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు కన్నన్, సుబ్రమణ్యంనాయుడు, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుఖాజాపీర్,ఇంకానాయకులు మురళి, వెంకటేశ్వర్లు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడికట్ల పూజ

రామచంద్రాపురం, నవంబర్ 20 ప్రభాతవార్త:



అయ్యప్ప పడికట్ల పూజ భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం నెత్తకుప్పం గ్రామంలో అయ్యప్ప స్వామి మాల ధారణ చేసిన భక్తులు పడికట్ల పూజను వైభవంగా నిర్వహించారు.గురుస్వామి మహదేవరెడ్డి ఉదయం స్వామి వారికి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అంబలం తయారు చేశారు. అనంతరంవినాయకస్వామి,సుబ్రమణ్యస్వామి,అయ్యప్ప స్వామి చిత్రపటాలను అంబలంలో వుంచి ప్రత్యేక పూజలునిర్వహించారు.భక్తులుభక్తిశ్రద్ధలతోఅయ్యప్పస్వామిభజనలుచేశారు.భాస్కర్‌స్వామి కుటుంబ సభ్యులుపడికట్లపైకర్పూరాన్ని వెలిగించి పూజను పూర్తి చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## నేటి బాల క్రీడకారులే రేపటి ప్రపంచ విజేతలు

వెదురుకుప్పం, నవంబర్ 20 ప్రభాతవార్త :



నేటి బాల క్రీడకారులే రేపటి ప్రపంచ విజేతలని వెదురుకుప్పం లయన్స్ క్లబ్ డెవలప్‌మెంట్ ఛైర్‌పర్సన్ పేట ధనంజేయులు రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచఫుట్‌బాల్ వేడుకల సందర్భంగా ఆదివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు హరికృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిది సంవత్సరాలలోపు బాలురకు ఫుట్‌బాల్ క్రీడ పై శిక్షణ కార్యక్రమం మహర్షివిద్యామందిర్ ఆవరణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సమాజహిత కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. క్రీడల పై ఆశక్తిగల చిన్నారులకు ఫుట్‌బాల్ క్రీడల పై శిక్షణ ఇప్పించే కార్యక్రమాన్ని ప్రపంచ ఫుట్‌బాల్ కప్ వేడుకల సందర్భంగా ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. చిన్నారుల ఆశక్తులను గమనించి వారి కలలను సాకారం చేసే ప్రయత్నం మంచిదని పిల్లల తల్లీదండ్రులను సంపూర్ణ సహకారం అందించాలన్నారు. అనంతరం అధ్యక్షులు హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఇరవై రెండవ ప్రపంచ ఫుట్‌బాల్ కప్ వేడుకలు ప్రారంభం సందర్భంగా చిన్నారులకు శిక్షణకు జట్టు ఏర్పాటు చేయడం చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. మండల కేంద్రంలో మినిస్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు క్లబ్ నిబద్ధతతో కృషి చేస్తుందన్నారు. వెదురుకుప్పం క్రీడలకు పుట్టినిల్లు అన్నారు. ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించగలరని చెప్పారు. ఫుట్ బాల్ క్రీడ నేర్చుకోవడంకు ఆశక్తిచూపుతున్న చిన్నారులు ఏకగ్రతతో సాధన చేసి మంచి గుర్తింపు తీసుకురావలన్నారు. విద్య,కీడ్రలు రెండు రైలు పట్టాలు లాంటివని రాణిస్తే చక్కటి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల వలన మానసిక, శరీరక వికాసం పెంపొందుతుందని చెప్పారు. ప్లే గ్రౌండ్ కమిటీ అధ్యక్షులు కిరణ్ యాదవ్ చిన్నారులకు అవసరమైన షూలు, డ్రస్సులు, ఇతర పరికరాలు అందజేయడంకు కృషి చేస్తానని చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలోవిశ్రాంతి ఫిజికల్ డైరెక్టర్లు మునిక్రిష్ణయ్య, నీలం దామోదరం శెట్టి, క్లబ్ ఉపాధ్యక్షులు బండి కమలేష్ రెడ్డి, నరసింహ రెడ్డి, ట్రెజరర్ యుగంధర్ రెడ్డి,సభ్యులు మహర్షి విద్యామందిర్ పాఠశాల కరస్పాండెంట్ వెంకటరమణ రెడ్డి, పురుషోత్తం, కోట్ పవన్, స్ధానికులు దుర్గ,యువత, విక్కీ, జయ చంద్ర, తులసి తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్, స్పందన

కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 20, ప్రభాతవార్త
తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 21వ తేది ఉదయం 10 నుండి 11 వరకు దయల్‌యువర్‌కమిషనర్‌కార్యక్రమం, 11 నుండి 12 గంటల వరకు నేరుగా అర్జిలు, పిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. 0877-2227208 నంబర్‌కికాల్‌చేసితమఫిర్యాదులుతెలియజేయవచ్చుఅని నేరుగా వచ్చి అర్జిలు, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు.

## రాస్ కేవీకే దత్తత రైతుకు రైతు నేస్తం పురస్కారం

రేణిగుంట, నవంబరు 20 ప్రభాతవార్త:



రాస్ కృషి విజ్ఞాన కేంద్రం రైతు రామచంద్రాపురం మండలం మిట్టూరు గ్రామానికి చెందిన కె.పురుషోత్తం నాయుడు పద్మశ్రీ డాఐవీ సుబ్బారావు రైతు నేస్తం పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం స్వర్ణభారత్ ట్రస్టులో జరిగిన రైతు నేస్తం వ్యవసాయ పత్రిక వార్షికోత్సవ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారాన్ని పురుషోత్తంనాయుడు అందుకున్నారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో వరిసాగు, వేరుశనగలో నూతన రకాల సాగు విత్తనోత్పత్తి, పశు గ్రాసాల సాగు, సూక్ష్మ, సాగు నీటి పద్ధతులు, బయో గ్యాస్ ఉత్పత్తి, వినియోగం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం పద్ధతులను ఆచరించడం తోటి రైతులకు తెలియజేయడం వంటి వాటిని దృష్టిలో ఉంచుకుని రైతు నేస్తం వ్యవసాయ పత్రిక పురస్కారానికి ఎంపిక చేశారని రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా. శ్రీనివాసులు తెలిపారు. వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎం.వెంకయ్యానాయుడు, మాజీ మంత్రి డా. కామినేని శ్రీనివాస్, రైతు నేస్తం ఎడిటర్ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు, డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరాం, నార్మ్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, నాబార్డు మాజీ ఛైర్మన్ చింతల గోవిందరాజులు, ఇతర అవార్డు గ్రహీతలు, రైతులు పాల్గొన్నారు. కె.పురుషోత్తంనాయుడు నేస్తం రైతు పురస్కారం అందుకున్న సందర్భంగా రాస్ కేవీకే ఛైర్మన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, కేవీకే శాస్త్రవేత్తలు ఆయన అభినందించారు.

## జాతీయ కార్యదర్శిని ఆహ్వానించిన సీఆర్ఎస్ విశ్రాంత ఉద్యోగులు

రేణిగుంట, నవంబరు 20 ప్రభాతవార్త:



ఇండియన్ రైల్వే మెన్ ఫెడరేషన్ 98వ జాతీయ వార్షిక మహా సభలకు ఢిల్లీలో ఉన్న జాతీయ రైల్వే మెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రాను రేణిగుంట సీఆర్ఎస్ విశ్రాంత ఉద్యోగులు ఆదివారం కలసి ప్రత్యేకంగా ఆహ్వానిం చారు. అక్కడ ఆయనకు శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. రైల్వే ఉద్యోగులకు చేసిన సేవలను కొనియాడారు. విశ్రాంత ఉద్యోగులు మాజీ మజ్దూర్ యూనియన్ నేతలు సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆర్ఎం విజయకుమార్, రామచంద్రయ్యలు తన కోసం ఢిల్లీ వరకు వచ్చినందుకు ఆయన వీరిని అభినందిస్తూ ఉద్యోగులకు మంచి సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు.

## ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

రేణిగుంట, నవంబరు 20 ప్రభాతవార్తం



రేణిగుంట లైబ్రరీలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గ్రంథాలయ అధికారి శ్రీముఖి ప్రతిరోజు విశిష్ట అతిథులు ఆహ్వానించి అనేక కార్యక్రమాలు నిర్వహింపచేశారు. అందులో భాగంగా పుస్తక ప్రదర్శన, మహా కవుల జీవిత విశేషాలు, పిల్లలకు ఆటలు, పాటలు, వ్యాసరచన, వకృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. అందులో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పరుగు పందెం బాలికల విభాగంలో కావ్య, ప్రణతిక, జ్ఞాన ప్రణతి, బాలుర విభాగంలో రిహాన్, నవదీప్, చైతన్య, కప్పగంతులు బాలికల విభాగంలో షాజిత, కావ్య, దీప్తి, బాలుర విభాగంలో ఆరిఫ్, అబిద్, హర్షిత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. వారోత్సవాలు జయప్రదం చేసినందుకు సర్పంచ్ నాగేషం, రేణిగుంట పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, వైస్ ఎంపీపీ సుజాత, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులు విష్ణువర్ధనికి లైబ్రరీ అధికారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కళాకారుల స్టెప్పులేసిన మంత్రి రోజా



తిరుపతి(క్రీడ), నవంబర్ 20ప్రభాతవార్త:
తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో వేడుకగా జరుగుతున్న జగనన్న స్వర్ణోత్సవ సంబరాల్లో ఆదివారం మధ్యాహ్నం పాల్గొన్న రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా కళాకారులతో కలసి ఆనందంగా నృత్యం చేసి, స్టెప్పులు వేసి కళాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. సాంస్కృతిక సంబరాల పోటీలను ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించడం,ఇందులో పాల్గొని కళాకారులతో కలసి నృత్యం చేయడం ఆనందకరమని రోజా అన్నారు. అనంతరం పలు ప్రదర్శనలిచ్చిన కళాకారులను అభినందిస్తూ ప్రశంసపత్రాలు, మెమొంటోలు బహుకరించారు.

## కన్నులపండువగా లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణోత్సవం



కల్లూరు, నవంబరు 20 ప్రభాతవార్త
పులిచెర్ల మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి ఆదివారం కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం కార్తీక మాసంఏకాదశి పురస్కరించుకుని స్వామి వారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.వేదమంత్రోత్సవాల మధ్య స్వామి వారికి కల్యాణం జరిపారు. ఏకాదశి కల్యాణోత్సవం విశిష్టతను గురించి ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు భక్తులకు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

## వివాహిత ఆత్మహత్య

గంగవరం, నవంబరు 20, ప్రభాతవార్త :
సంతానం కలగలేదని ఓ వివాహిత పురుగులు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా..మండలంలోని గంగ్రాజుపల్లె పంచాయతీ మగ్రిమాకులపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు మొదటి భార్య రాజేశ్వరికి పిల్లలు కలగలేదని అదే గ్రామానికి చెందిన వెంకటరమణ గారికుమార్తె మహేశ్వరిని ఆరు నెలల క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు.ఈ నేపథ్యంలో మహేశ్వరి మూడు నెలల గర్భవతి అయితే ఇటీవల మహేశ్వరికి గర్భస్రావం కావడంతో ఇక తనకు పుల్లలుపుట్టరేమోనని మనస్థాపం చెందిన మహేశ్వరి శనివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.అపస్మారకస్థితిలో పడి ఉన్న మహేశ్వరిని కుటుంబ సభ్యులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.చికిత్స పొందుతూ ఆదివారంఉదయం మృతి చెందినట్లు తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గణనాధుని దర్శించుకున్న సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మీ



కాణిపాకం నవంబం 20 ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ మున్సిపల్ శాఖ ఛీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మీ ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నా రు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ ఈఓ వెంకటేసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు. వారి వెంట చిత్తూరు చుడా వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, చిత్తూరు మున్సిపల్ కమీషనర్ అరుణ, దేవస్థానం ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండపై తరగని భక్తుల రద్దీ

బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 20 ప్రభాతవార్త
శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం కొండ దినం కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలిరావడంతో అమ్మవారి కొండ భక్తజనసంద్రమైంది. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు, వేదపండితులు వేకువజామునే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో రద్దీగా కనిపించాయి. విశేష సంఖ్యలో వచ్చిన యాత్రీకులకు ఆయల ఛేర్మన్ మిద్దింటి శంకరానారాయణ, ఇఓ చంద్రమౌళి, అధికార, సిబ్బంది సేవలందించారు.

## జిల్లా మహిళా వాలీబాల్ జట్టుకు భారతి ఎంపిక



శాంతిపురం, నవంబర్ 20 ప్రభాతవార్త
ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా వాలీబాల్ జట్టుకు మండలంలోని అనికెర జోగిండ్లుకు చెందిన మునెప్ప, గోవిందమ్మల కుమార్తె భారతి ఎంపికైంది. ఆదివారం బంగారుపాళెంలో జిల్లా జట్ల ఎంపిక చేయగా భారతి ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు కోచ్ పిడి మురళీధర్ తెలిపారు. భారతి పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వచ్చే నెలలో పశ్చిమ గోదావరి జాల్లా పాలకోడేరులో అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుంది.

## వరసిద్ధుని సేవలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్



కాణిపాకం, నవంబర్ 20 ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ కాం గ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పులికాట్ జాలర్ల కుప్పాలు అప్రమత్తం
### - తుపాను ముందస్తుతో వేట నిషేధం

తడ, నవంబర్ 20 ప్రభాతవార్త
బంగాళాఖాతంలో మరోసారి అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో తడ మండలంలోని పులికాట్ జాలర్ల కుప్పాలను అధికారులు అ ప్రమత్తం చేశారు. తిరుపతి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తడ మండల అధికారులు పులికాట్ సరస్సులో చేపల వేట నిషేధించారు. సరస్సులోకి వెళ్లిన వారు సైతం వెనక్కి మళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రానికి కొంత ఈదురుగాలులతో కూడిన వాతావరణం కనిపించడంతో మరికొన్ని గంటల్లో అల్పపీడన ప్రభావం వర్షం రూపంలో కూడా కనిపిస్తుందని తీరప్రాంతాల వారికి హెచ్చరికలు జారీ చేశారు.

# ఏళ్ళ తరబడి శ్రమ ఎదిగిన ఏరియా ఆసుపత్రి



### 30 పడకల స్థాయి నుండి 50 పడకలకు జీఓ
### నిష్ణాతులైన వైద్యులు .. అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది
### నాడు నేడుతో ముస్తాబవుతున్న భవన సముదాయం

చంద్రగిరి-ప్రభాతవార్త:
ఏళ్ళ తరబడి కేవలం ఓపి సేవలకే పరిమితమైన చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అంచెలంచెలుగా అభివృద్ధి చెందడంలో ఇక్కడ పుష్కర కాలానికి పైగా సేవలందించిన ఎందరో వైద్య సిబ్బంది శ్రమ దాగివుంది. ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రత్యేక చొరవతో అనధికారిక 30 పడకల స్థాయి నుండి నేడు 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఎదిగిన ఏరియా ఆసుపత్రిలో సగటున రోజుకు 300 మందికి వివిధ రకాల వైద్య సేవలందిస్తున్న ఆసుపత్రి పట్ల ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రత్యేక చొరవతో నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఆధునిక హంగులతో ముస్తాబు చేయిస్తున్నారు. కేవలం ఓపి సేవలకే పరిమితమైన ఏరియా ఆసుపత్రిని నాటి గైనకాలజిస్ట్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఒకప్పటి డిసిహెచ్ఎస్, ప్రస్తుత ఏపివివిపి అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ సరళమ్మ విశిష్ట సేవలను ప్రస్తావించకతప్పదు. జీఓ లేని సమయంలో ఆపరేషన్లు చేయడం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందనే ఆందోళన వున్నప్పటికీ ఆసుపత్రి అభివృద్ధి చెందాలంటే శస్త్ర చికిత్సలు చేయడం తప్పని సరి అని భావించిన డాక్టర్ సరళమ్మ నాటి ఎంఎల్ఎ మాజీ మంత్రి గల్లా అరుణకుమారి చేతులమీదుగా కుటుంబ నియంత్రణలకు సరిపడే విధంగా ఆపరేషన్ థియేటర్‌ను సిద్ధం చేసి ప్రారంభించుకున్నారు. ప్రభుత్వం విధించే టార్గెట్లను అధిగమించే రీతిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి ఓపిలను రెండంకెల స్థాయి నుండి మూడంకెల స్థాయికి పెంచారు. ప్రసూతి మహిళలకు వారంలో ఒకరోజు గురువారం ప్రత్యేకంగా ఓపి సేవలందించే విధంగా నిర్ణయించడంతో దాదాపు 100-120 మందికి పైగా ఓపి చూడటంతో పాటు స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే మరో అడుగు ముందుకేసి కాన్పులు ఇక్కడే చేయడానికి సంసిద్ధమై విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కేవలం రక్తహీనత, గర్భంలో శిశువు స్థితిని అనుసరించి మాత్రమే మెరుగైన సేవలు అందుబాటులో గల తిరుపతి ప్రసూతి వైద్యశాలకు తరలిస్తున్నారు. నిరుపేదలకు నాణ్యతాప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడంలో వైద్య సిబ్బంది ముందడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరిప్రసాద్ (ఆర్థోపెడిక్) ఆధ్వర్యంలో 9 మంది వైద్యులు, 19 మంది నర్సులు రోగులకు సేవలందిస్తున్నారు. ప్రతి శుక్ర, మంగళవారాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ప్రతి గురువారం ప్రసూతి మహిళలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ సదరం క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా శస్త్ర చికిత్సలకు, కాన్పులకు అవసరమైన సాంకేతిక అనుమతులకై కృషి చేస్తున్నారు. కాగా అత్యంత ప్రాధాన్యత కలిగిన జనరల్ సర్జన్, పిడియాట్రిస్ట్ వైద్యులు ఇక్కడికి బదిలీ చేయబడినప్పటికీ విధులకు హాజరు కావడంలేదు. దీంతో ఏపివివిపి ద్వారా పై రెండు పోస్టులకు వైద్యులను ఇక్కడికి బదిలీ చేయాల్సివున్నది. ఎంఎల్ఏ చొరవతో రాజ్యసభ సభ్యుడు పరిమళ నత్వాని ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్‌ను మంజూరు చేసినప్పటికీ డ్రైవర్‌ను ఏర్పాటు చేయవలసిన ఏపివివిపి చేతులెత్తేయడంతో అంబులెన్స్ ఆసుపత్రి ఆవరణలో అలంకార ప్రాయంగా మారింది. ముఖ్యమైన మరో విషయం ఎంఎల్ఏ కృషితో 50 పడకల సిహెచ్‌సిగా గుర్తించబడినప్పటికీ ఆసుపత్రికి మంజూరు కావలసిన నిధులు కేవలం 30 పడకలకు మాత్రమే విడుదల చేస్తుండటంతో నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదేవిధంగా ఆసుపత్రిలో పేషెంట్లకు డైట్ అందుబాటులోకి తీసుకురాగలిగితే మరింత మంది రోగులను అడ్మిట్ చేసుకుని వైద్య చికిత్సలు అందించే అవకాశం లభించగలదు. ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో వుంటున్నారు. అదే విధంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు స్టే డ్యూటీలు లేనందున కాల్ డ్యూటీలు అమలు చేస్తున్నారు. నిష్ణాతులైన వైద్యులతో పాటు అనుభవజ్ఞులైన స్టాఫ్‌నర్స్‌లు అందుబాటులో వుంటూ నిరంతరం రోగులకు సేవలందిస్తున్నారు. వంద పడకలకు అనుకూలమైన ఏరియా ఆసుపత్రి భవన సముదాయాన్ని ఏపివివిపి విభాగ యంత్రాంగం సమర్ధవంతంగా పూర్తి స్థాయిలో వినియోగించుకోగలిగితే బాగుటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

## ఆహ్లాదకరంగా 'పద్మశాలి' వనభోజన మహోత్సవం!
### -వైభవంగా శ్రీ భద్రావతి సమేత భావనాఋషి కళ్యాణం



చంద్రగిరి, నవంబర్ 20 ప్రభాతవార్త:
చంద్రగిరి మండలం,శ్రీనివాసమంగాపురంలోని టిటిడి కళ్యాణమండపం నందు ఆదివారం ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల వరకు 'పద్మశాలి సంక్షేమ సంఘం' ఆధ్వర్యంలో 21వ వార్షికోత్సవ కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమం ఆహ్లాదకరంగా జరిగింది.కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటల నుండి 11 వరకు శ్రీ భద్రావతి సమేత భావనాఋషి కళ్యాణోత్సవం వేద పండితుల నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం చిన్న పిల్లలకు చిత్రలేఖనం,పరుగు పందెం,బాల్ ఇన్ బక్కెట్,తదితర పోటీలు నిర్వహించారు.మహిళలకు ముగ్గుల పోటీలు,మ్యూజికల్ చైర్స్,పరుగు పందెం లాంటి పోటీలు నిర్వహించారు.అలాగే వినూత్న రీతిలో దంపతులకు జంటగా పరుగు పందెం నిర్వహించారు.కార్యక్రమంలో ప్రధానంగా అవివాహితులైన యువతీ యువకులకు వివాహ పరిచయ వేదిక కార్యక్రమం చేపట్టారు.మద్యాహ్నం భోజనానంతరం తిరిగి ఆటల పోటీలను కొనసాగించారు.సాయంత్రం వివిధ రకాల పోటీలలో విజేతలైన వారికి మొదటి,ద్వితీయ తృతీయ బహుమతులను అందచేశారు.అలాగే పదవ తరగతి,ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాదించిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతులు అందచేశారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డా॥సేపూరి రామమోహన్,కార్యదర్శి ఎవిఎల్.నారాయణ, కోశాదికారి,ఎ.లలితాదేవి, గౌరవాధ్యక్షులు ఎం.ఓబులపతి,బోడగల మాధవయ్య,ఎస్‌వి.ప్రసాద్,గౌరవ సలహాదారులు డా॥మంతెన రాజయ్య,డా॥సేపూరి భాస్కర్,ఉపాధ్యక్షులు టి.సెల్వరాజు, ఇప్పలపల్లి వెంకట శేషయ్య,సంయుక్త కార్యదర్శి వద్ది రమేష్,కార్యవర్గ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, భక్తవత్సలం,డా॥రాధాకృష్ణ,నూకల కిరణ్,నూకల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు,సోమా వరలక్ష్మి,పెద్ద సంఖ్యలో పద్మశాలీయులు కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు.

## ఇఓచే ఆకాశదీపం ఆవిష్కరణ

శ్రీకాళహస్తి,నవంబర్ 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం భక్తి శ్రద్దలతో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు.ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. ఉదయం నుంచి ఆలయంలో సామాన్య భక్తులు, మరో వైపు విఐపిల తాకిడి పెరుగు తుంది .కోట మండపం వద్ద స్థానిక మహిళా భక్తులు విశేషంగా హాజరు కాగా అలయాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఇఓ వికె సాగర్‌బాబు ఆవిష్కరించారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా భక్తి శ్రద్దలతో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ సురేష్‌రెడ్డి, విజయసారథిలు ఆవిష్కరింపజేసారు. టెంపుల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరాజు, ఇఓ సిసి హరి,దఫేదార్ దాము తదితరులు పాల్గొన్నారు.

## పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సిఎం



తిరుచానూరు,నవంబర్ 20 ప్రభాతవార్త:
శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం మద్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి పట్టు వస్త్రాలను అమ్మవారికి సమ ర్పించారు. ఆలయం వద్దకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి టిటిడి ఆలయ అర్చకులు,అధికారులు సాంప్రాదయబద్ధంగా స్వాగతం పలికారు.దర్శనానంతరం వేద ఆశీర్వచనంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఈఓ ధర్మారెడ్డి దంపతులుతో పాటు జేఈఓ వీరబ్రహ్మం దంపతులు,ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,ఆగమ సలహాదారు శ్రీనివాసా చార్యులు,ఆలయ అర్చకులు బాబుస్వామి,ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి,సూపరింటెం డెంట్లు శేషగిరి, మధు, ఏవిఎస్ఓ శైలేంద్రబాబు, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు,మేనేజర్ జనార్ధన్‌రెడ్డి,ఇతర అధికారులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సత్వరం ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిల డిమాండ్
### -రేపు కలెక్టరేట్ ఎదుట యూటిఎఫ్ ధర్నా

చిత్తూరు, నవంబర్ 20 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దీర్ఘకాలకంగా పెండింగ్‌లో వుంచిన బకాయాలను సత్వరం చెల్లించాలని రాష్ట్ర యూటిఎఫ్ నాయకులు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి డిమాండు చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను సత్వరం చెల్లించాలన్న డిమాండుతో మంగళవారం కలెక్టరేట్ ఎదుట యూటిఎఫ్ ధర్నా నిర్వహించనున్నట్లు ఈధర్నాను జయప్రదం చేయాడానికి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. చిత్తూరు యూటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూటిఎఫ్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ అరియర్లు, సరెండర్ లీవులు, మెడికల్ రీఅంబర్స్ మెంట్, రిటైడ్ ఉపాధ్యాయులు జీఐఎస్, ఎర్న్డ్ టీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ఆర్థిక సంభందమైన బకాయిలు దీర్ఘకాలంగా చెల్లించాల్సి వుందన్నారు. పీఆర్సీ చర్చల సందర్భంగా మార్చి 2022 నాటికి అన్ని బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటి వరకు ఆహామీని నెరవ్చే లేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం 1826 కోట్లు రూపాయలు పైబడి చెల్లించాల్సి వుందన్నారు. ఓ వైపు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఎలాంటతి డోకా లేదని పేర్కొంటుండగా మరో వైపు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటవ తేదీకి చెల్లించాల్సిన జీతాలు సైతం సకాలంలో చెల్లించడం లేదని ఆరోపించారు. అలాగే వివాహాలు, ఆసుపత్రుల ఖర్చులు వంటి అత్యవసర సందర్భంలకు పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు తదితర మొత్తాలను చెల్లంచడకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సరెండర్ లీవులు, ఇతర ఆర్థికపరమైన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారనే విషయంపై స్పష్టత లేదన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర యూటిఎఫ్ నాయకులు టి.రఘుపతిరెడ్డి, జిల్లా యూటిఎఫ్ అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు పి.సుధాకర్‌రెడ్డి, రమణలు, నాయకులు సోమశేఖర్‌నాయుడు, రాధాకృష్ణ, సుధాకర్‌నాయుడు, పీఆర్ మునిరత్నం, రహనాభేగం, ప్రసన్నకుమార్, దక్షణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి అమ్మవార్లకు లక్షబిల్వార్చన కుంకుమార్చనలు



శ్రీకాళహస్తి,నవంబర్ 20 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏటా నిర్వహించే స్వామి వారికి లక్షబిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నారు.ఆదివారం ఈ సేవల్లో ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు పాల్గొన్నారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో స్వామికి లక్ష బిల్వాలతో, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించటం ఆనవాయితి.ఈ నెల 22న ఈ కార్యక్రమాలు పూర్తి కానున్నాయి. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం మొదటి మూడు కాలాభిషేకాలు 4వ కాలం ప్రదోష కాలం అభిషేకం అనంతరం లక్ష బిల్వార్చన నిర్వహించబడుతుంది. భోళాశంకరునికి బిల్వాలంటే ఎంతో ఇష్టమని కాబట్టి లక్ష బిల్వాలతో అభిషేకించేందుకు ఈ పూజలు రూపకల్పన చేసినట్లు తెలిపారు.అలాగే అమ్మవారికి కుంకుమంటే ఎంతో ఇష్టమని కాబట్టి అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ఏడాది ఈ పూజల్లో భక్తులు విశేష సంఖ్యలోపాల్గొంటున్నారు. ఆదివారం ఈ పూజలకు కూడా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయ బద్ధంగా స్వామి అమ్మవార్లతోపాటు శ్రీ-కాళ-హస్తులను ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 22న అష్టోత్తర కలశాబిషేకం సాయంత్రం స్వామి అమ్మవార్లను అంబారిపై ప్రదక్షిణలు నిర్వహించనున్నట్లు ఇఓ తెలిపారు.

## పుష్ప ప్రదర్శనశాలను ప్రారంభించిన ఈఓ

తిరుచానూరు,నవంబర్ 20 ప్రభాతవార్త:
బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ సమీపంలోని శుక్రవారపుతోటలో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలను ఆదివారం టిటిడి ఈఓ ధర్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లా డుతూ శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారపు తోటలో టిటిడి ఉద్యా నవన విభాగం ఆధ్వర్యంలో వివిధ పౌరాణిక అంశాలతో కూడిన సెట్టింగులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.భక్తులు అమ్మవారి వాహనసేవలతో పాటు వీటిని కూడా తిలకించాలని ఆయన కోరారు.

# రోడ్డు ప్రమాద మృతుల కుటుంబ సభ్యులకు అండగా పోలీసు శాఖ

### ఆపరేషన్ అడిషనల్ ఎస్పీ కే.వి.శ్రీనివాసరావు

చిత్తూరు,నవంబర్ 20,ప్రభాతవార్త:
రోడ్డు ప్రమాద మృతుల కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ అన్నివిదాలుగా ఆదుకుంటుందని ఆపరేషన్ అడిషనల్ ఎస్పీ కేవి శ్రీనివాసరావు పేర్కొన్నారు.ప్రపంచ రోడ్డు ప్రమాద బాదితుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రోడ్డు ప్రమాద మృతుల కుటుంబ సభ్యులతో సమావేశం కావడం జరిగింది.ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా పరిధిలో గత ఏడాది నవంబర్ నుండి నేటి వరకు చిత్తూరు జిల్లాలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన,గాయపడిన వారి కుటుంబ సభ్యులు హాజరైయ్యారు.ఈ సమావేశంలో ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబసభ్యులకు ప్రమాద భీమా నుండి రావలసిన రాయతీలు, పోలీసు శాఖ నుండి అందించాల్సిన పత్రాలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.పెండింగ్‌లో ఉన్న కేసుల తాజా స్థితిగతులు చేపట్టవలసిన న్యాయ సేవలపై ఆయన చర్చించారు.పోలీసుల కోసం కాకుండా ప్రతి ఒక్కరు వారి ప్రాణాలను కాపాడుకోవడం కోసం ద్విచక్రవాహనంలో ప్రయాణించే సమయంలో హెల్మెట్ దరించాలన్నారు.రోడ్డు ప్రమాదాలలో భారత దేశం అగ్రస్థానంలో ఉందని,ప్రపంచ దేశాలలో ఉన్న వాహనాలలో 1 శాతం వాహనాలే భారత దేశంలో ఉందని తెలిపారు.దేశంలో ప్రతి గంటకు 53 రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు మృతి చెందుతున్నారన్నారు.దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారని,రోడ్డు ప్రమాదాలలో యువకులు అధికంగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్డు భద్రతా నియమాలు ప్రజల కోసం అన్ని విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు.అలాగే ప్రతి ఒక్కరు లైసెన్స్ పొందిన తరువాత వాహనాలు నడపాలని సూచించారు.ఈ సమావేశంలో ట్రాఫిక్ డిఎస్పీ తిపేస్వామి,ఎస్ఐలు జయప్ప,బాబు,సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆపరేషన్ అడిషనల్ ఎస్పీ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబ సభ్యులకు పండ్లు పంపిణీ చేశారు.